ముగింపు ఏమో తెలుసు

నేనూ ఆమె చిన్నప్పుడు ఒకే కళాశాలలో చదువుకున్నాం. పదిహేనేళ్ళ తర్వాత ఢిల్లీలో కాపురం చేస్తుండగా మళ్ళా ఆమెను చూడటం జరిగింది. చిన్నప్పటి స్నేహితులు, చదువు, కళాశాలలో ఉపాధ్యాయులు—ఇవన్నీ ముచ్చటించుకుంటూ, వార్షికోత్సవ సందర్భంలో తరగతి విద్యార్థులందరూ కలిసి తీయించుకున్న ఫోటో ఒకటి తీసి, అందులోని వ్యక్తులు ఎవరెవరు ఏం చేస్తున్నదీ, ఎక్కడెక్కడున్నదీ ఆరాలుతీసి స్మరించుకుంటున్నాం. మూలగా నిలబడ్డ ఒక వ్యక్తికేసి చూపించి, 'పాపం మురళి ఎక్కడున్నాడో!' అన్న దామె. మురళెవరు?' వెంటనే స్ఫురణకురాలేదు. 'పావలా ఫ్లూట్ మీద గానంచేస్తుండేవాడట హాస్టల్లో— తెలీదు?' అని అందిచ్చింది. జ్ఞాపకంవొచ్చింది. అతన్ని 'బాలు' అనేవాళ్ళం. వేణువాద్యమే కాకుండా, భావగీతాలు కూడా వ్రాస్తుండేవాడు. 'ఎక్కడున్నాడో?'

'ఏమో, నాకూ తెలీదు. అతన్ని మళ్ళా ఎప్పుడూ కలుసుకోడం జరగలేదు' అన్నాను. అక్కడనుండి వొచ్చేసిం తర్వాత 'బాలు'ని గురించిన కుతూహలం హెచ్చింది. 'పాపం మురళి ఎక్కడున్నాడో!' అన్న దామె. ఆ 'పాపం' ఎందుకు? 'బాలు' యిప్పు డెక్కడున్నదీ, ఏం చేస్తున్నదీ తెలుసుకోవాలని అన్వేషణ సాగించాను. ఎంద రెందరికో వ్రాశాను.

ఆరాలు తీశాను. నా యత్నాలు ఫలించాయి. 'బాలు'ను గురించి తెలుసుకున్నాను....

'ఏమిటో నువ్వు చెప్పనక్కర్లేదు. నాకూ తెలుసు' అన్నాడు మిత్రుడు శాస్త్రి.

'చెప్పు చూద్దాం' అన్నాను.

ఫలానా అని చెప్పేశాడు శాస్త్రి. ఆశ్చర్యపడ్డాను. సత్యాన్వేషకుడు సాధించే దారుణఫలితాలలో సత్యాన్ని తెలుసుకోడం వొకటి కాబోలు ననుకున్నాను.

నిజంగా జరిగిన ఒక సంఘటన ఆధారంగా ,వొక కథ వ్రాద్దామని సంకల్పించి, ఆ వృదంతం మిత్రుడు శాస్త్రికి చెప్పి చూశాను. కథ ముగింపు ఆశ్చర్యంగొల్పేదిగా వుండాలంటారు విమర్శకులు. ముగింపు యిట్టే చెప్పేశాడు శాస్త్రి. ఇంక నేను కథ వ్రాయడం దేనికి?

ఆధునిక సాహిత్యం వింతమార్గాలు తొక్కి ఎందుకు విపరీతమైన ధోరణులు వ్యక్తంచేస్తోందో కొంచెం అర్థమవుతూంది. నూతనమైన వొస్తువు దొరకదు. ప్రతి విషయం గురించీ, పెద్దలు యిదివరలో వ్రాసేవున్నారు. చెప్పే తీరులో, 'శిల్పం' లో విశిష్టత కనపర్చాలి. ఈ కసరత్తంతా దీని ఫలితమేమో ననిపిస్తుంది. దీర్ఘసమాసాసనం, కామాల వైక్లబ్యం, చుక్కల పందెం, బ్రాకెట్ల మేళవింపు, గద్యకవితల ముష్టియుద్ధం, వికృతప్రయోగా లనబడే నిప్పుచక్రాలగుండా దూకుళ్ళు – యివన్నీ ఆధునిక సాహిత్య తాలింఖానాలలోని కొన్నివింతలు. మిత్రుడు శాస్త్రికూడా నాతో ఏకీభవించాడు. అతన్ని గురించి వ్రాస్తూ 'హెమింగ్ వే ప్రభావం ఈయన

మీద బాగా కనిపిస్తోంది' అన్నాడట వొక విమర్శకుడు. శాస్త్రి గోల. అత నెప్పుడూ, హెమింగ్వే రచన వొక్కటి కూడా పూర్తిగా చదవలేదట. చదవలేదు మొర్రో అంటే నమ్మేవా ళ్ళెవళ్ళంటాడు. 'ఇందులో పాత్రలన్నీ కల్పితాలు' అంటాడు రచయిత. చాలాభాగం కల్పనాసాహిత్యంలో రసవత్తరమైనది, ముందు రచయిత చెప్పిన యీ వొక్క వాక్యమేమో నని పిస్తుంది.

అంతమాత్రంచేత, భయపడిపోయి కథారచన విరమించ వల్సిందే! శాస్త్రి వొక రచయిత, విమర్శకుడు. రచనకి అతను ఆపాదించే విలువలు వేరు, సామాన్యపాఠకుడు కోరే ఆనందం వేరు. ముగింపు తెలిసిపోయినంతమాత్రాన కథ కుంటువడుతుం దనుకోనక్కర్లేదు. ఈనాడు అపరాధపరిశోధక నవల చాలా ప్రచారంలోవుంది. పాశ్చాత్యదేశాలలో దానికున్న పలుకు బడి, ప్రచారం మరే యితరరకంరచనకీ లేవనొచ్చు. వీటిల్లో చాలాభాగం హంతకుడెవడో తెలుసుకోడంలో పాఠకుడికి వినోదం, ఉత్కంఠోల్లాసం సమకూరుస్తాయి. మరోరకం డిటెక్టివ్ నవలలో, హంతకు డెవడో మనకి ముందే తెలిసిపోతుంది. అసలు కథంతా హంతకుడే చెప్పివేస్తాడు. కాని అత నట్లా ఎందుకు చెయ్యాల్సివొచ్చింది – ఏవిధంగా చేశాడు – అతని మనస్తత్వం ఏవిధంగా అల్లా ఏర్పడింది – కారణాలు, అవకాశం, అవలంబించినవిధానం – వీటిని చర్చించడం, యీ రకం నవలవుద్దేశం. వీటిపట్ల కుతూహలం పాఠకుడిలో ఎప్పుడూ వుంటుంది. పాఠకుడి యీ కుతూహలాన్ని తృప్తిపరచే వుద్దే శంతో యీ రచన సాగించడంలో ఆక్షేపణ వుండదనుకుంటా.

ఆటవికశాఖవారు జంతువులచర్మాలు వేలం పాడుతున్నారని తెలిసి మా వూళ్ళో చౌదరిగారు – వొక ధనికుడు– పులిచర్మాలు తీసుకురమ్మని పంపితే ఆ వూరెళ్ళాను. ఆటవిక శాఖాధికారినొకరొచ్చి, వారిబంగళాకి తీసుకెళ్ళాడు. అధికారి గారిపేరు మూర్తి. స్నానం చేస్తున్నారు, అల్లా కుర్చీలో కూర్చోమన్నారు. గోడలకేసి చూస్తూ వరండాలో పచార్లు చేస్తున్నాను. గోడలని అడవిమృగాల తలలు – కొమ్ములు, కోరలు, చర్మాలు– అమర్చబడివున్నాయి. ఆటవికశాఖాధికారికూడా కాస్తోకూస్తో భయంకరంగా వుంటాడని నా వూహ. నిజంగా మూర్తి అల్లాగే వున్నాడు. చూడగానే ఏ ఉత్తరదేశపాయనో అనుకున్నా. దగ్గరదగ్గరగా ఆరడుగులఎత్తు – అంతఎత్తుగా వుంటే గాని ఆ శాఖలో ఉద్యోగం దొరకదు కాబోలు – కొంచెం నలుపు. నల్లగుడ్డుచుట్టూ తెలుపు 'జీర', రంధ్రాలు కనపడేట్లు వొంకరతిరిగిన ముక్కు. దట్టమైన కనుబొమలు, తాంబూలంవల్లో పొగాకువల్లో అక్కడక్కడ డాగైనపళ్ళు, పై పెదవిని కప్పిన మీసం, చదరంగా కత్తిరించబడిన తెల్లవెంట్రుకలతో వైవిధ్యాన్ని తెచ్చుకున్న గడ్డం – అది ఆయనవైఖరి. రాగానే కరస్పర్శచేశాడు. నలిగినవేళ్ళని సరిచేసుగుంటూ కూర్చున్నా. తొందరపనిమీద జీపులో వెళ్ళాలిట – వొగంటలో వొచ్చేస్తాను, యీలోగా అసిస్టెంట్లు చర్మాలన్నీ తనిఖీనిమిత్తమై ప్రదర్శిస్తారు, వాటిని చూస్తూవుండమని చెప్పి, అమ్మగారితో టిఫిన్ విషయం చెప్పవలసిందిగా నౌకర్‌తో మాట్లాడాడు. అటూ యిటూ చూసి లోపలికెళ్ళి వొక తోలుహంటర్ తీసుకొచ్చాడు.

'ఇది అడవిపంది చర్మం' అని హంటర్ చూపించాడు. 'మొన్ననే వేటాడాం.' ఏమనాలో తెలిసింది కాదు. హంటర్ తిప్పుకుంటూ జీపులో ఎక్కాడు. ఊపిరాడక సగ్గినట్లుగా, జీపు నానా భీభత్సం చేసి నిష్క్రమించింది.

ముందుగదిలో బల్లమీద కొన్ని పత్రికలు కనిపించాయి. కాలక్షేపానికి ఏదేనా పత్రిక తీద్దామని లోపలికెళ్ళాను. పత్రికలతో పాటు ఏవో కరపత్రాలూ వున్నాయి. వొకటి నే చదువుకున్న కళాశాల పాతవిద్యార్థుల సమావేశానికి రావలసిందిగా పంపిన ఆహ్వానపత్రం. కవరుమీద శ్రీమతి సీతాదేవి అని వ్రాసివుంది. సీతాదేవి ఎవరు? మూర్తిగారి చెల్లెలా? కూతురా?

నౌకరు టిఫిన్ సరంజాం బల్లమీద పెట్టిన చప్పుడైంది. వెనక్కి తిరిగాను. ఆమె కనబడింది చటుక్కున ఆమె లోపలి కెళ్ళిపోయింది. ఆ వొక్కక్షణంలోనూ ఆమెను పూర్తిగా చూశాననే చెప్పాలి. మొహం అంతా ఆవరించే పెద్ద కళ్ళు. ఎండి ఆనందంతో విడిపోయిన దానిమ్మని స్ఫురింపచేసే పళ్ళు పమిటకొంగుని పాయిలుగా స్ఫుటంగా విడదీసిన ఎత్తయిన వక్షస్థలం - స్త్రీ కాబట్టి - ఇన్నింటినీ క్షణికమైన దృష్టి యిముడ్చుకుంది.

ఇంతట్లోకి 'అసిస్టెంట్' వొచ్చాడు. అతని వెనకాల మరో యిద్దరు నౌకర్లు చర్మాలకట్టలని పట్టుకొచ్చారు. అసిస్టెంటు పొట్టిగా వున్నాడు. కొనవూపిరితో అక్కడక్కడ అంటిపెట్టుకుని వున్న వెంట్రుకలమధ్య నిగనిగ మెరిసే బట్టతల- అటవీశాఖలో వుద్యోగాలని గురించి నే అనుకున్నది తప్పని

ప్రత్యక్షంగా ఋజువుచేస్తున్నా డీ వ్యక్తి. జింక, దుప్పి, సివంగి-పిల్లచర్మాలు చూపిస్తున్నాడు. నా క్కావల్సింది పులిచర్మం. అవి దూరంగావున్న క్యాంప్ షెడ్‌లో వున్నాయట. తీసుకొస్తానని వెళ్ళాడు.

ఆమె మళ్ళా మధ్యగదికిటికీలోంచి చూసింది. నేను మళ్ళా ఆమెకేసి చూశాను. కళ్ళు అంత మరీ పెద్దవి కావు-పళ్లు దానిమ్మని స్ఫురింపజేస్తున్నా అదింకా పచ్చిదానిమ్మే. ఆ చీర మడతలుపడే స్వభావం కలది గాని, రొమ్ములు మరీ అంత స్ఫుటమైనవీ, ఎత్తయినవీ కావు. ఈసారి నా దృష్టిని ఎక్కువగా ఆకర్షించినది ఆమె ఎర్రటిపెదవులు. సంధ్యాసమయంలో పటమటాకాశంలో కమ్మిన నల్లమేఘాలని చీల్చిన కడసారి సూర్యకిరణంలా. గుమ్మంలో కొచ్చింది.

'చక్కెరై పోయింది. ఇక్కడ దొరకదు. బెల్లం కొంచెం వేశాను. మరి కొంచెం కావాలా?'

పరాయిస్త్రీని పరీక్షగా చూడటంగూర్చి మనస్సు పీకుతున్నా, ఆమె నెక్కడో చూసినట్లుగా వుండడంవల్ల అల్లా చూశానేమో. ఆమెకూడా అందుకే అలా చూస్తోందేమో!

'మూర్తిగారు—మీకు—'

'మావారే'

'వారు ఏ కాలేజీలో చదువు—'

నవ్వింది.

'నన్నింకా గుర్తు పట్టలేదా?'

నేనూ నవ్వాను. ఇప్పుడు గుర్తుపట్టాను. ఆమెని సీతారామమ్మగా కళాశాలలో ఎరుగుదును. తాశీల్దారుగారమ్మాయి.

పదునాలుగు, పదిహేనేండ్ల నాటి మాట. కళాశాలకల్లా ముగ్గురే విద్యార్థినులు; ఒకామె క్రైస్తవకన్య 'అన్నా'; రెండో ఆమె 'జమున[illegible]' - తండ్రి డాక్టరు; వంగదేశస్థుడు. స్త్రీలు చదువుకోవాలనీ, వరుణ్ణి వారే ఎన్నుకోవాలనీ, కట్నాలూ అవీ ఇవ్వకూడదనీ, జిల్లాకలెక్టర్‌గారు ఉపన్యాసాలిస్తూండేవాడట. ఆయన్ని తృప్తిపరచి, మెప్పుపొందడం కోసం తాశీల్దారుగారు, సీతారామన్నని కళాశాలలో సాహసంచేసి చేర్పించాడని ఆ రోజుల్లో వింతగా చెప్పుకునేవారు. అప్పుడు ఆమెకి పదిహేను పదహారేళ్ళుంటాయేమో. మాతో చదువుకున్న దేగాని నిజంగా ఆమెతో ఎప్పుడూ నే నింతవరకూ మాట్లాడలేదు - ఆమె కంఠం ఎట్లావుంటుందో మాకు తెలీదు. తలొంచుకొని కూర్చునేది. ఆమె అప్పు డెట్లా వుండేదీ నాకు జ్ఞాపకంలేదు. సన్నగా వుండేది. సాధారణఛాయ. కనురెప్పలు తీర్చి దిద్దినట్లుగా, వొంపులుతిరిగి, నీడలుపడుతున్నట్లుగా, అస్పష్టమైన వొకదృశ్యం మెదడులో మసలుతుంది - పొగమంచుతో నిండిన అద్దంలోంచి వర్షపుధారలని చూసినట్లుగా. ఇప్పుడెంతో మారిపోయింది. కాలంకాఠిన్యాన్ని కవులంతా ఆడిపోశారంటే యిందుకే కాబోలు! యౌవ్వనంపై మమకారం కొద్దీ కండలు పెరిగి, సన్నటి శరీరాన్ని కప్పేసి కౌగిలించుకున్నాయి. అప్పుడే కళ్ళకింద చర్మంపై గీతలు, మెరుపుల్లా మధ్యమధ్య తెల్ల వెంట్రుకలు - ఎర్రటి పెదవులను మినహాయించి నడివయస్సుస్థబ్ధత ఆవహించేసింది.

'చాలా మారిపోయ్యాను కదూ' అం దామె.

'న న్నెల్లా గుర్తుపట్టావు?'

‘పాతవిద్యార్థుల సమావేశపు ఆహ్వానం నిన్ననే వొచ్చింది. సమావేశంజరిగిన వారానికి చేరింది యీ ఆహ్వానం. పాతసామాను తిరగవేస్తూంటే కళాశాలపత్రిక కనపడింది. అందులో మనబృందంఫోటో వుంది. మీరూ వున్నారు, తీసుకొస్తా నుండండి’ అని లోపలి కెళ్ళిం దామె.

ఈ పదిహేనేళ్ళలోనూ ఆమెలో కలిగిన మార్పు చూసింతర్వాత నే నెంత మారిపోయుంటానో తల్చుకుని కాసేపు దిగులుపడ్డాను. యౌవనం ఎప్పుడు అస్తమించి నడివయస్సుస్తబ్ధత ఎప్పుడు మీదపడుతుందో ఎవరిమటుకు వారికి తెలీదు. బ్రహ్మచర్యం అవలంబించి, శరీరశక్తుల్ని ఖర్చు చెయ్యకుండా భద్రపరచుకుంటే యౌవనం మరికొంతకాలం నిలబడుతుందా? నిలబడదు. పైపెచ్చు అల్లాచేస్తే మరికొన్ని మానసికజాడ్యాలుకూడా సంక్రమిస్తా యంటున్నారు మన స్తత్వ శాస్త్రజ్ఞులు. శరీరం మోటుగా ప్రవర్తిస్తుంది—యౌవనంలో పేట్రేగుతుంది. నడివయస్సులో నిదానిస్తుంది. వార్ధక్యంలో శుష్కిస్తుంది. సంస్కృతి, తపస్సు, ఆధ్యాత్మికాన్వేషణ—యివేవీ యీ మార్పుని ఆపుచెయ్యలేవు. ఇది గమనించే కాబోలు మార్క్సు మొదలైన మేధావులు ప్రపంచచరిత్ర పునాదుల్ని మట్టిలోంచి పెల్లగించ మంటున్నారు.

‘ఇదిగో చూడండి’ అని కళాశాల సంచికలో ఫోటో చూపించింది. సంచికలో పుటలన్నీ తాకిడికి పొడుంగా రాలిపోతున్నాయి. ఆ ముగ్గురు విద్యార్థినులలో మధ్యనున్నది ఆమె. వెనకాల నిలబడ్డవారిలో రెండోవాణ్ణి నేను.

'మీ రేమిటి – అంత, అల్లాగైపోయారు?'

నేను భయపడ్డట్టుగానే ఆ శాస్త్రప్రశ్న అడిగేసింది. కాని, 'అంత లావు' – లాంటి కటువైన పదాలు వాడకుండా కనికరించింది. నాలో మార్పు గుర్తించతగిందా కాదా అని అడుగుదా మనుకున్నాను. కాని ధైర్యం చాల్లేదు.

'రంగనాథం ఏం చేస్తున్నాడో?'

రంగనాథం ఇంగ్లీషులో ఫస్టు. కాలేజీ పత్రికకి సబ్ ఎడిటర్, బి. ఏ. ఆఖరేడు. నేను ఇంటర్ మొదటి సంవత్సరం.

'రంగనాథం గూడ్స్ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఆమధ్య పెరంబూర్‌లో కనిపించాడు' అన్నాను. షేక్స్‌పియర్ నాటకాలు బాగా చదివేవాడు. అతనంటే ఉపాధ్యాయులకి కూడా బెదురేనని చెప్పుకునేవారు. ఎక్కడ షేక్స్‌పియర్, ఎక్కడ గూడ్స్‌గార్డ్!

'అన్నా, ఎక్కడుందో?'

'స్కూలుమాస్టరు.'

'జ్యోయ్ మొతిదేబీమాటో' అన్నా వంగభాషలో ఉచ్చారణ అనుకరిస్తూ.

'మెడిసిన్ పూర్తిచేసి కలకత్తాలో డాక్టరుగా పని చేస్తోంది. అప్పుడే కళ్ళకి జోడు, ముగ్గురు సంతానం' అని ఆమె స్వేచ్ఛగా నవ్వేసింది. కళ్ళజోడుకి సంతానానికీ ఏం సంబంధమో తెలీక కాబోలు!

'ఇతను గోపాలం కాదు–? తెలుగు మాస్టార్ని అల్లరి ప్రశ్నలతో విసిగించేవాడు'

'మీ కింకా జ్ఞాపకముండే. ఇప్పుడెక్కడున్నారో తెలీదు' అన్నాను.

'సరే – యిది మీరు – పులిచర్మాలకోసం ప్రస్తుతం యిక్కడున్నారు' అని సంవాదం సాగించింది.

'కూర్చున్నవారిలో మధ్యనున్నది ప్రిన్సిపాల్, ఆయన సతీమణి. రిటైరయి యిప్పుడు అమెరికాలో వున్నారు. ఆ రోజులు స్మరించుకుంటూ కాబోలు ఆమె మౌనంలో పడింది. నేను టిఫిన్ పూర్తి చేశాను.

'చూశారా – నేనూ పాతవిద్యార్థినే, ఆహ్వానమే మటుకు లేదు. స్త్రీల కెల్లాగైనా...'

ఒక మతిమరుపు జడ్జిగారిలా వుంది నా ధోరణి. ఆయన భార్య ఏదో ప్రశ్న లడుగుతూవుండేవట. వాటిల్లో ఏదో వొకదానికి సందర్భంలేకుండా నాలుగైదు రోజులయ్యాక సమాధానం చెప్పేవాడుట. ఒకరోజు వుదయం 'ఏమీ లేదు, పిల్లలే' అన్నాడుట. రెండురోజుల క్రితం 'ఆ చప్పుడేమిటండీ?' అని ఆమె అడిగిన ప్రశ్నకి సమాధానమని వారంతర్వాత ఆవిడకి స్ఫురించిందట.

నన్ను వాక్యం పూర్తి చెయ్యనీకుండానే సీతాదేవి అంది.

'మీకూ ఆహ్వానం వొచ్చే వుంటుంది. వెనకటి అడ్రసుకి పంపివుంటారు. అనేక అడ్రస్‌లు మారి నాకు చేరినట్లుగా మీకూ ఎక్కడికో వెళ్ళేవుంటుంది. అయినా మనం వెళ్ళడం జరగదుగా'

అది నిజమే. కాని ఆహ్వానం రాలేదంటే కొంచెం చిన్నతనంగా వుంటుంది.

'నా కొచ్చిన కవర్ మీద అడ్రస్ చూశారా? మా వారిపేరు టి. కె. మూర్తి అనుంది. వి. కె. మూర్తి అనుండాలి. అందుకనే మావారి కది చూపలేదు. తప్పుపేరిట ఆహ్వానం అందుకోడంబదులు, అసలు రాకపోవడమే మెరుగనుకున్నా — పేరుగాని, ఇంటిపేరుగాని కవరుమీద, కార్డుమీద సరిగ్గా వుండకపోతే బాధగా వుంటుంది. డర్బీస్వీప్‌లో మన కో లక్షరూపాయ లొచ్చిందన్న వార్త తెలియజేసే వుత్తరమైనా పేరు సరిగ్గా లేకపోతే చిన్నబుచ్చుకోడంమాత్రం తప్పదు.

నౌకర్‌తో టిఫిన్ సరంజాం తీసెయ్యమని సంజ్ఞ చేసింది. నేను లేవబోతుంటే, ఆ ఫొటోలో వెనక నిలబడ్డ వారిలో మూలగావున్న వ్యక్తికేసి చూపించి 'పాపం, మురళి ఎక్కడున్నాడో?' అన్నదామె. మురళెవరు? వెంటనే స్ఫురణకు రాలేదు. ప్రశ్నార్థకంగా మొహంచిట్లించాను. 'పావలా ఫ్లూట్ మీద గానంచేస్తుండేవాడట హాస్టల్లో — తెలిదూ?' అని అందిచ్చింది. జ్ఞాపకంవొచ్చింది. అతన్ని 'బాలు' అనేవాళ్ళు. బాలకృష్ణ, మరోతరగతి వాడవడంవల్ల మాతో కూర్చునేవాడు కాదు. మా అందరికీ వారానికోసారి ప్రిన్సిపాల్‌గారి పాఠం వుండేది. అప్పుడే కలుసుకునేవాళ్ళం. హాస్టల్లోకూడా వాళ్ళవి మేడమీది గదులు, మావి కింద. ఒక ముస్లిమ్ రోజూ హాస్టల్ ముందు ఫ్లూట్ వాయిస్తుండేవాడు. ఫ్లూటు అమ్ముతుండేవాడు కూడా. 'బాలు' వొకఫ్లూట్‌కొని, ఎవళ్ళూ లేనప్పుడు ఏదో మూలగా వెళ్ళి వాయించుకుంటూవుండేవాడట. ఎంతవరకు

అభ్యసించాడో, ఎల్లా వాయించేవాడో నాకు తెలీదు. అతనికి ఎవళ్ళా పెన్సిల్ ముటుకు యిచ్చేవాళ్ళు కాదు—వాణ్ణి నోట్లో పెట్టుకుని కొరకడమో, ఊపడమో చేస్తాడని భయం అంటూ వేళాకోళం చెయ్యడం నాకు గుర్తు. అతను తెలుగులో మంచి మార్కులు తెచ్చుకునేవాడు. సంస్కృతం కూడా చదువుకునే వాడు. మా తెలుగు పండితులకి అతనంటె చాలా యిష్టం. కాని ఆ రోజుల్లో తెలుగుకి అంత పరపతి లేకపోవడంవల్ల యితన్ని వో ముఖ్యుడుగా ఎవరూ పరిగణించారనుకోను.

'ఎక్కడున్నాడో ఏమో నాకు తెలీదు. అతన్ని మళ్లా ఎప్పుడూ కలుసుకోడం జరగలేదు' అన్నాను.

ఇంతలో అసిస్టెంట్ వొచ్చాడు. పులి చర్మాలని యిక్కడికి తేవడం కష్టం. టెంట్ దగ్గరకే వొచ్చి చూచుకో మన్నాడు. సరేనని లేచాను.

'జాలయ్యని, జేమ్సుని తీసుకురమ్మనండి' అన్నది సీతాదేవి. అసిస్టెంట్ సరేనని వెళ్ళాడు. ఆవిడ బల్లమీద వుత్తరాలు, పుస్తకాలు, పత్రికలు, సంచిక అన్నీ తీసుకుని లోపలికెళ్ళింది. నౌకరు టేబిల్‌పై గుడ్డతీసి దులిపాడు. నేను కాస్త దూరంలో వున్న తేనెపట్టుని చూస్తూ కూర్చున్నా. పదినిమిషాల్లో మరో చీరకట్టుకుని ఆమెవొచ్చి, 'రండి – ఇల్లు చూద్దురుగాని' అని ఆహ్వానించింది. అది తిరువనంతపురం చీర–వెడల్పు జరీ, పల్చగా, తెల్లగా, నాజూకుగా వుంది. ఊదారంగు జాకెట్టు కనిపిస్తోంది. పదిరాళ్ళతో పొదిగిన నెక్లెస్ మెడని చుట్టుకుంది. తెల్లరాళ్ళ దుద్దులు–మధ్య ఎర్రరాయి మెరుస్తోంది. ఆవిడ వేషధారణలో నైపుణ్యంగలదని తెలుస్తూనే వుంది. సరైన

దుస్తులు, ఆభరణాలు, పోషణవల్ల నడివయస్సుని ఆమడ దూరంలో వుంచినట్లుంది. లోపలికెళ్ళాం. గదుల్లో మృగాల తలకాయలు గురించి చెప్పింది. భర్త ధైర్యసాహసాలను ప్రస్తావించింది. నెలక్రితం వొకట్రెండూ వొక సివంగిని వేటాడాట్ట. ఇద్దరికీ అన్యోన్యం కుదిరినట్టు తెలుసుకున్నాను. భర్త సాహసకృత్యాలని చెప్పడంలో వుద్దేశం లేకపోలేదు. తన వివాహానికి పూర్వం అతను చాలా పిరికివాడట. తనొచ్చిం తర్వాత, అతను మారిపోయి, అపూర్వమైన శక్తులను, తెలివిని ప్రదర్శిస్తున్నాడుట. సీతాదేవి భర్తని ఘనకార్యాలు సాధించ డానికి పురికొల్పింది. ఆమె ప్రేమ ప్రేరణవల్ల అతను తన్మయు డయ్యాడు. ఆదర్శం స్పష్టంగా లేనంతవరకూ, మానవుడు ఆ ఆదర్శంకోసం ఎన్ని త్యాగాలన్నా చెయ్యడానికి సిద్ధపడ లేడు కాబోలు. ఇంతకీ ఆమె ప్రేరణవల్ల అతను సాధించదలి చిందేమిటి? నాకు తెలీదు. తోటలో కెళ్ళాం. రెండు జింకలూ, నెమిలి వున్నాయి పంజరాల్లో వింతవింత పక్షు లున్నాయి. తల్లోంచి పడిన పువ్వుని ఆమె వొంగి తీసింది. వొంగినప్పుడు పొట్ట ముడతపడింది – ముడతేమిటి, రెండు ముడతలు. జాలే సింది. ఆదర్శం స్పష్టంగా వుండకపోవడమే మంచిదేమో. నే నెల్లాగయ్యానో! మెడకింద గీతలు కనపడసాగాయి. ఆనాటి నుంచీ అద్దం చూసుకోడం తగ్గింది.

సీతాదేవివివాహం జరిగి ఎంతకాలమైందో? పిల్లలా? ఆమె వయస్సు దాదాపు ముప్పై – ఇల్లా అనుకుంటూ వుం డగా ఆమె మాట్లాడ్డం సాగించింది. 'ఎవరి ప్రయత్నమూ లేకుండా అంతా అల్లా జరిగిపోయింది. అదో చిత్రమైన గాథ.'

'చెప్పండి, వినాలనుంది.'

'నేనూ, మా పినతల్లి, వాంటాయనా కార్లో వెళుతున్నాం. పెదనాన్నకి జబ్బంటే చూశొద్దామని బైలుదేరాం. ఆయన నెక్కడో మారుమూల కాంప్‌లో వుండగా పక్షవాతం వొచ్చిందట. పక్షవాతం అంటే నాకు భయం. మా తండ్రిగారు దానివల్లనే కాలంచేశారు. ఐదేళ్ళయింది. కారు అడవిలోంచి పోతోంది. రాత్రి తొమ్మిదైందనుకుంటా. నట్టడివిలో టైరు చెడింది. స్పేర్ టైర్ ఆ సాయంత్రమే వేశాడు. ఏమిటి చెయ్యడం? కీకారణ్యం. అరణ్యం రోద. దూరంగా ఏవో అరుపులు. మా పిన్ని ప్రాణా లుగ్గబెట్టుకుంది. ఏం చెయ్యాలో ఎవ్వరికీ తెలియడంలేదు. వాంటాయన కర్రా కలపా పోగుచేసి మంటచేశాడు. మంటకి ఏ జంతువూ రాదట. ఇంక రాత్రంతా ఆ అడవిలో గడపాల్సిందే! డ్రైవరు కొంత దూరంవెళ్ళి ఎవరన్నావుంటే పలుకుతారని కేకవేశాడు. ఇంతలో పెద్దగాలి, వర్షం. మంట కాస్తా ఆరిపోయింది. అప్పుడు భగవంతుడల్లే మూర్తిగారు ప్రత్యక్షమయ్యాడు. గడ్డం అదీ చూసి చీకట్లో భయపడ్డాను. తరవాత చెప్పారు. అడవుల్లో క్యాంప్‌చేస్తూ మనుషులతో సంపర్కం తగ్గి గడ్డంచేసుకునే అలవాటు విడిచిపెట్టారు. ఈ అడవిలోనే కాంప్‌చేస్తున్నాడట దూరంగా కేకలు వినిపించాయట. మమ్మల్నందరినీ టెంట్‌లోకి చేరేశాడు. కాసేపటికి వాన వెలిసింది. మళ్ళా మంటలు చేశారు. స్టౌవ్‌మీద కాసినన్ని పాలుంటే కాచిచ్చాడు. పిన్ని తాగి పడుకుంది. అల్లా కల్సింది స్నేహం.'

నేను ఇంకా అది ఊహించుకోగలను. అద్భుతమైన ప్రకృతిదృశ్యం. కొండలు. లోయలు, పెద్దఅడివి - దూరంగా ఎక్కడో అడివి జుట్టులో మధ్యపాపిటలాగ చిన్న కాలవ - అడివి దేవత జుట్టుబుచేసి చీదినట్టుగా వర్షం, చీకటికి జడుసుకొని దూరంగా వెళ్ళి మెరవని తారకలు - ఈ ప్రకృతిలో వుండి పోదాం అనుకుంటూ వుండేవాణ్ని కాని, నిజంగా వుండలేను. ఒకక్షణం దర్శనమిచ్చి మానవహృదయానికి గగుర్పాటు, సున్నితమైన ఆవేదన, తాత్కాలిక సౌందర్యానుభూతి కలిగించేటందుకే యీ ప్రకృతి భీభత్సదృశ్యం. 'నువ్వు నాలోవాడి వేస్తా' అని వొక్కసారి జ్ఞాపకంచేసే దూరపుచుట్టం ప్రకృతి - అది చచ్చిందో బ్రతికిందో ఎవరికీపట్టలేదు. భయం, చీకటి, చలి, ఆకలి-శరీరానికి నిబ్బరం, వెలుగు, వెచ్చదనం, సంతృప్తి కావాలి. శరీరం దగ్గరగా, యింకా దగ్గరగా జరిగింది. ఆకలి అనే జ్వాలలో ఆ శరీరాలు నిశ్శబ్దంగా పడ్డాయి. మంట చల్లారింది. తెల్లవారింది. వెలుగు. నిబ్బరం, కొత్తబలం, సంతృప్తి చెందిన శరీరపు వికాసం - ఇవన్నీ వివాహం అనే సంస్థలో అంతమొందాయి. ఆ అనుభవం, రోజూ, అందరికీ ఏదో విధంగా లభ్యమయ్యేదే. కాని ఆ శరీరాలు, ఆ పరిస్థితులు, తిరిగిరావు. జ్ఞాపకం మాత్రం నిల్చిపోతుంది. చివరివరకూ అదే స్మరించుకుంటూ, అదే యిదనుకుని, భ్రమతో జీవితయాత్ర సాగుతుంది.

ఆమె మళ్ళా మాట్లాడుతోంది:

'తరవాత తెల్సింది. ఆయన కాంప్ చేస్తున్నారట. భోజనం సామగ్రి, అసిస్టెంట్లు, నౌకర్లు ఆ సాయంకాలానికి

జీపులో చేరుకోవాలిట. ఆ జీపు కూడా చెడిపోయిందట. వారెవ్వరూ రాలేదట. ఈ సహోద్యోగి కూడా పడిపోయి, ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని, ఎవరేనా మనిషి కనబడితే బాగుండుననని దైవాన్ని ప్రార్థిస్తూ కూచున్నాడట. భగవంతుడులా మేం కనిపించామట. లేకపోతే భయంవల్ల ఆయన ప్రాణం విడిచేసి వుండురట' అని ఆమె నవ్వింది.

'ఇదంతా జరిగి ఎంతకాలమైంది?'

'నాలుగు నెలలు'

అతనికి ముప్పైరెండు, ఆమెకి ముప్పైఒకటి – ఇంతవరకూ పెండ్లి ఎందుకు కాలేదో? ఆదర్శాల అన్వేషణో? ఒకానొక ఆదర్శ స్త్రీకోసం వేచివున్నాడట. ఇరవైయేళ్ళకి దొరికిందట. తను ఆదర్శపురుషుడికోసం అన్వేషణ సాగిస్తూన్నాదట ఆమె. మధ్య నాకెందుకివన్నీ? అడిగేటందుకు నేనెవర్ని?

ఇంతలో అసిస్టెంటొచ్చాడు. జేమ్సు తలకి పట్టీ వేసున్నాడట. అక్కడికే వెళ్ళి చూడడం తప్పదన్నాడు. బైలుదేరాను. పావుగంటలో అక్కడికే వచ్చాడు మూర్తిగారు. వేలంలో పాడే అవసరం లేకుండానే కొంచెం తక్కువధరకి చర్మం నాకు లభింపచేశాడు. నేను సెలవుతీసుకుని వెడతానన్నాను.

'భోజనం చెయ్యరూ?' అన్నాడు.

'వెడతాను, చౌదరిగారు కనిపెట్టుకొని వుంటారు నాకోసం' అన్నాను.

'ఏదేనా పుచ్చుకుని వెళుదురుగాన్లెండి' అన్నారాయన. ఇద్దరం బంగళా కెళ్ళాం. పళ్ళు, నిమ్మరసంతో డ్రింక్ తెచ్చింది సీతాదేవి. ఏదో మాట్లాడటంకోసం అన్నాను. 'ఈ ప్రాంతంలో అడివిపందులు ఎక్కువుంటాయా?'

'ఎక్కువే. పెద్దపులులు లేవు. ఎప్పుడేనా చిరతపులి రోడ్డుకడ్డంగా పడుకునివుంటుంది. మీరు తీసుకెళుతున్న పులి చర్మం ఉత్తర హిందూస్థానంనుంచి వొచ్చినది. కల్నల్ ఆండర్సన్ పేరు విన్నారా? ఆయన వేటాడిన పులి చర్మంట మా కిచ్చినది. టానింగ్ పరికరాలు మంచివి రాలేదు. బాగా టాన్ చేస్తే యీ పందిచర్మం చాలా ఆకర్షణీయంగా వుంటుంది.'

నే వెడతానని లేచాను.

'ఉండండి' అని గదిలోకెళ్ళి బల్లమీదవున్న నాలు గైదు హంటర్లలో వొకటి తీసుకొచ్చి నా కిచ్చారు.

'ఇది వుంచుకోండి - జ్ఞాపకార్థం.'

నేను తీసుకుని 'థ్యాంక్' చేసి దాన్ని పరకాయించి చూశాను. రెండడుగులు పొడుగుంటుంది. - అంత బరువూ లేదు. చుట్టూ నల్లచర్మంతో కప్పివుంది. చివరలో పట్టుకునేందుకు తోలుపటకా వొకటుంది. ఊరికే అలంకారానికీ, చేత్తో తిప్పుకునేటందుకూ ఆర్మీ ఉద్యోగుల హస్తభూషణం అది. తోలుగొళ్ళెం కాస్త చిరిగింది. చివరలో రెండుమూడు పసుపు పచ్చ డాగు లున్నాయి చర్మంపైన. ఆయన లోపలికెళ్ళాడు. నేను గదిలో బల్లదగ్గర కెళ్ళి, మిగిలిన నాలుగు హంటర్లనీ చూసి, వాటిలో డాగులూ, చిరుగులూ లేని మధ్యనున్న మంచి

హాంటర్ని సరి, నా చేతిలోది అక్కడపెట్టేసి. జైలుకొచ్చాను. జ్ఞాపకార్థం తీసుకెడుతున్న బహుమతి కొంచెం కొత్తదిగా వుండడమే మంచిదనుకున్నా. అన్నీ హాంటర్లూ వొకటే – ఏ హాంటరైతే నేం? కాని నే కొత్తగా వేసుకున్న హాంటర్ మరీ తేలికగా కనపడింది. – కాస్తంత సన్నంగాకూడా వుందేమో. మరీ మంచిది. ఇంతలో మూర్తిగారు పైకం ముట్టినట్లుగా సంతకంపెట్టి రసీదిచ్చారు. 'ఈ ప్రాంతంకేసి వొచ్చినప్పుడు యిక్కడికి రాకుండా వెళ్ళకండేం?' అంది సీతాదేవి. 'ఓ తప్ప కుండా' అని ఉభయుల దగ్గరా శెలవుతీసుకొని వొచ్చేశాను.

ప్రయాణంలో తోవపొడుగునా – అసలు అంతకి ముందునుంచీకూడా – ఆమె 'పాపం, మురళి' అని ఎందు కన్నదా అని వితర్కించుకుంటూనే వున్నా. 'పాపం' ఏమిటి? అర్థంలేనిముక్క. అతన్నిగురించి ఆమె కేం తెలుసు? 'పాపం' అనగలిగేటంత తెలుసు. అదేమిటి? 'పాపం' అనేది పేచీలతో కూడుకున్నమాట. దాని కెన్నో అర్థాలున్నాయి. ఉచ్చరించిన విధంబట్టి, ఆ అర్థాలు మారుతూంటాయి. 'పాపాలు చెయ్యడం' అనడానికీ 'పాపం చెయ్యడం' అనడానికీ తేడావుంది. కొన్ని వాక్యాలు చూడండి 'పాపం పండింది' 'పాపాలు పెరిగిపోతున్నాయి' 'పాపిష్టి బ్రదుకు' 'పాపాలకల్లా భైరవుడు' పాపం మంచివాడు. 'ఏం పాపం! 'మరే పాపం' 'పాపానికి పశ్చాత్తాపం లేదు.'

వీటిని గురించి ఆలోచిస్తే స్థూలంగా రెండురకాల అర్థాలు కనబడతాయి, నైతికంగా ఖండించదగిన చెడ్డపని అన్నది వొకటి. లౌకికదృష్ట్యా సానుభూతి అన్నది రెండోది.

'పాపం మంచివాడు' అనడంతో జాలి ప్రకటితమవుతుంది – లౌకికదృష్ట్యా ఆ మంచితనాన్ని కొంత హేళన చెయ్యడమూ వుంది. సీతాదేవి వాడిన 'పాపం' లో జాలిపడటం వుంది. అతని మంచితనాన్ని కొంత వెక్కిరించడమూ వుంది. మంచివాడు స్త్రీని ఆకర్షించడేమో! మంచివాడు తనకోసం చేసిన త్యాగాన్ని స్త్రీ క్షమించదేమో! సీతాదేవి అతన్ని క్షమించింది. 'పాపం మురళి' అని అప్రయత్నంగా అనేసి తన ఆకృతిని (నైతికంగానా?) స్థిరపరచుకుందా? అతనేం చేశాడు? అసలేం జరిగింది? ఇలాంటివి ఎన్నో ప్రశ్నలు ఎదురైనాయి. నా కుతూహలం రేకెత్తింది. అతన్ని గురించిన వివరాలు సేకరించాలని అన్వేషణ సాగించాను.

చదువుకునే రోజుల్లో గోపాలం, నేనూ హాస్టల్లో వొక గదిలో వుండేవాళ్ళం. శెలవలకి యింటికి కెళ్ళినప్పుడు, పెద్దపెద్ద వుత్తరాలు వ్రాసుకునేవాళ్ళం. అదృష్టవశాత్తు ఎగ్జిబిషన్లో అతన్ని కలుసుకోడం జరిగింది. వ్యవసాయశాఖలో పనిచేస్తున్నాట్ట. వాళ్ళ స్టాల్ తో కూడా నలుగురికీ వివరించి చెప్పేటందుకు అతన్ని పంపారుట. అతనే నన్ను గుర్తుపట్టాడు. 'బాలు' గురించి ఎత్తాను.

'నీదగ్గర కాలేజీ మేగజీన్ లేదా?' అన్నాడు.

'లేదు.'

'ఎక్కడైనా దొరికితే చూడు. అందులో అతని భావగీతాలు కూడా పడ్డాయి.'

'ప్రేమ గీతాలా?'

'ఏమో నాకేం గుర్తులేదు. సాధారణంగా ఆ వయస్సులో యువకులందరూ వెళ్ళబోసుకునే శృంగార జాడ్యం' అన్నాడు.

'ఫ్లూట్ వాయించేవాడట.'

'చెప్పుకునేవారు. నేనూ వినలేదు. ఐనా అతని గొడవ నీకెందుకు?'

'పెద్దయింతర్వాత బాల్యస్నేహితులు ఎల్లా తయారయ్యారా అని తెలుసుకోవాలన్న కుతూహలం' అన్నాను.

'అతన్ని ఆచారి బాగా ఎరుగును' అన్నాడు.

'రంగాచారా? ఎక్కడున్నాడు?'

'ఈ వూళ్ళో. పవర్ హౌస్‌లో పనిచేస్తున్నాడు. ఏడాదైంది యిక్కడికి ట్రాన్స్‌ఫరై.'

నా కాశ్చర్యంవేసింది. దగ్గరకొచ్చినకొద్దీ దూరమైపోతాం అన్న ఇంగ్లీషు పద్యంలో పాదం స్ఫురణకొచ్చింది. ఆచారిని కలుసుకున్నా, అవీ యివీ మాట్లాడుకున్న తర్వాత 'బాలు' విషయం అడిగాను.

'పేరు?'

'బాలు—బాలకృష్ణ.'

'కృష్ణయ్యా! 'బాలు' అనడం నే నెరగను. కృష్ణయ్యగానే ఎరుగుదును. కథలు అవీ వ్రాస్తూండేవాడు. కాలేజీ మేగజీన్‌లో అతని కథ వొకటి పడింది' అన్నాడు.

'ఆ, అతనే. ఇప్పుడేం చేస్తున్నాడు?' అని అడిగాను.

'ఆ కథపేరు 'రంభ' '

'అతనే, ఏం చేస్తున్నాడు?'

'రంభతో సరసాలాడుతున్నాడు' అన్నాడు.

'అదేమిటి?'

'రాజేశ్వరీ క్రితం టి. బి. వొచ్చి పోయ్యాడు.'

నాకు విచారం వేసింది. 'పాపం మురళి' అనుకున్నాను. టి బి. వొచ్చి చనిపోలేదు. ఏ స్త్రీనో ప్రేమించి, విఫలుడై ఆత్మహత్య చేసుకున్నాడు–అనుకుంటే మనస్సుకి శాంతి.

నా కథ ముగిసింది. నే చెప్పినట్టుగా విని శాస్త్రి చేసిన వ్యాఖ్యానం తప్పని తేలిపోయింది. అపరాధ పరిశోధక నవల చదివి, హంతకుడెవడో పాఠకుడు పోల్చుకోలేకపోతాడు. తన కివ్వబడిన విషయాలను పురస్కరించుకొని ఫలానా అని నిర్ణయిస్తాడు, చివరపుట చూడగానే. అతను కాడు. మరొకడని తేలిపోతుంది రచయిత విజయం సాధిస్తాడు. నేనూ శాస్త్రిపైన విజయం సాధించాను.

ఈ విషయం సీతాదేవికి జాబుద్వారా తెలియచేస్తే? ఉత్తరం భర్త చూస్తే ప్రమాదం ఏమన్నా వుంటుదా? ఆలోచన తెమలక సాయంత్రం సినిమాకెళ్ళాను. విశ్రాంతి సమయంలో సోడా తాగుదామని బైటకొచ్చాను. ఎవరో భుజం చరిచారు. వెనక్కి తిరిగాను. గుర్నాథం. గుర్నాథంది బట్ట తలైపోయింది. పొంటులో చొక్కా అమరికగా వుండడంలేదు. కాసేపు వ్యగ్గపెడితే లోపలికెళ్ళినట్టుగా వున్నా, లాగూలు విసర్జించి, పంచకట్టుపై పటకా వేసి బిగించేసమయం వొచ్చిందనుకున్నా. అతనికి నలుగురు పిల్లలుట. ప్రపంచం ఎలా కదలిపోతూంది! జీవితం ఎల్లా పెరిగిపోతూంది! ఆ శృంగారం ఆ

కలఘ్న, ఆ ఆదర్శాలు, భావగీతాలు ప్రపంచాన్ని పెంచడానికేనా ? సృష్టిని ఆపడం ఎవ్వరితరం ?

'పాపం బాలకృష్ణ, టి. బి తో చనిపోయ్యాడుటగా?' అన్నాను.

'ఎవడా అన్నదీ? చనిపోయిన వాళ్ళ కుటుంబానికి ఇన్స్యూరెన్స్ డబ్బుని కంపెనీ వారిచే కక్కిస్తున్నాడు' అన్నాడు గుర్నాథం.

'అంటే'

'నాలుగేళ్ళ క్రితం హైదరాబాద్‌లో కలుసుగున్నాను. ఇన్స్యూరెన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. టి. బి. తో చనిపోయింది కృష్ణయ్యచెౌదరని - బి ఏ. మొగకేడు. కథలు వ్రాస్తుండేవాడు. మన బాలు-బాలకృష్ణ - వాడికేం హాయిగా వున్నాడు.'

'పెండ్లయిందా ?'

'అవకుండా వుంటుందా ? ఆ విషయం నే నడగలేదు సుమా. ఆరోజుల్లో జ్యోత్స్నమతీదేవిని దూరంగా ఆరాధించే భక్తులలో అత నొకడు. భావగీతాలు వ్రాసేవాడు - అంతా రవీంద్రుడు, ఊర్వశి, శాంతి నికేతనం - ధోరణి ఆమె వంగ కన్యగా - అందుకు. ఆవిడకి ఫ్లూట్ అంటే యిష్టంట. ఇంటి దగ్గర పాపయ్యశాస్త్రి ఫ్లూట్ నేర్పేవాడట. మనవాడుకూడా షేక్ ఖురాసాహెబ్ దగ్గర నో పావలా ఫ్లూట్ కొని వూదేవాడు. బుస్‌బుస్‌మని చప్పుడేగాని సంగీతం లేదు. నాతో చెప్పుకొని యిదయ్యేవాడులే. ఓసా రేం జరిగిందో తెలుసా?'

'చెప్పు'

'పెట్టిలోంచి ఓ సంచీ వెల్లగించాడు. అందులోంచి ఓ ఎముకముక్క చూపించాడు. నే జడుసుకున్నా. 'యిది మా అమ్మది' అన్నాడు. వాళ్ళమ్మ చనిపోయిందిట. దహనం జరిగిన మొన్నాడు అస్థికలన్నీ ఏరింతర్వాత అందులో వొక దాన్ని దాచేశాడుట. 'ఈ ఎముకలో నే నొకభాగం - చిత్రంగా వుండదూ!' అన్నాడు.

'నా కీదంతా మార్బిడ్....'

'అసహజంగా వుండదూ చంపక. ఓ రకంగా సెంటిమెంటల్...'

'చవలుడందూ చంపక' అన్నాను. ఇద్దరం నవ్వుకున్నాం.

'మరోసారి మరో తమాషా' అన్నాడు గుర్నాథం.

'చెప్పు.'

'శెలవలిచ్చారు. ఇళ్ళకి పోతున్నాం. గదిలో ఎవ్వరూ లేరు. పెట్టెలోంచి ఓ పొడుగాటి వెంట్రుక తీశాడు. 'ఇదెవరిదో తెలుసా?' అన్నాడు. 'మీ అమ్మదా?' అన్నాను. 'కాదు జయమతిది' అన్నాడు. 'నీ కెట్లావొచ్చింది?' 'ఎవరితోనూ చెప్పకు. అప్పుడప్పుడు నానోట్సు ఆమె తీసుకుంటూ వుండేది. మొన్న బుక్కు తిరిగిచ్చేసింది. పుటలమధ్యలో యిదుంది.' 'కావాలని పెట్టిందంటావా?' 'అనుకుంటే ఎంత ఆనందం!' అన్నాడు. తీరాచేసి ఇన్సూరెన్సు ఏజంటుగా తయారయ్యాడు.

ఇన్సూరెన్సు వృత్తిని ఎందుకు చులకన చెయ్యాలో నాకు తెలీదు. అతను పనిచేస్తున్న ఇన్సూరెన్సు కంపెనీ పేరు తెలుసుకొని యింటికి వొచ్చేశాను. తొందరపడి సీతాదేవికి

ఉత్తరం వ్రాయనందుకు సంతోషించాను. మనం చేస్తున్న పనులవల్ల ప్రపంచాని కెంతటి వుపకారం జరుగుతోందో తెలుసుకుంటే, నిరుద్యోగులు బాధతో కుమిలి హతమవరు.

ఆ మొన్నాడే ఇన్సూరెన్సు ఆర్గనైజరు సత్యనారాయణ్ణి కలుసుకుని ప్రస్తావించాను.

'ఇప్పుడాయన మా కంపెనీలో పని చెయ్యడంలేదు. అప్పుడే యిది వొదిలేసి నాలుగేండ్లయింది. అడవిమృగాలని పెంచుకునేవారికి – సర్కస్‌లు నడిపేవారికి – జంతువుల ఇన్సూరెన్సు పథకాన్ని వొకదాన్ని తయారుచేశాట్ట! ఆ వ్యాసం పెద్దలని ఆకర్షించిందట. షికాగోపత్రికకూడ దాన్ని ప్రచురించిందట. వెంటనే అతనికి అటవికశాఖలో పెద్ద వుద్యోగం లభించింది' అన్నారు సత్యనారాయణ.

'ఇప్పుడెక్కడున్నాడు?'

'మీ చౌదరిగారు ఇన్సూర్ చెయ్యమని పులిచర్మం తెచ్చాడు. అది ఆయనదగ్గర కొన్నదే. మీరే వెళ్ళి తెచ్చారుటగా.'

నేను స్తంభించిపొయ్యాను. నేను నమ్మను. నాటకంలో వేషం అన్నట్టు, ఇందులో ఏదో మోసం వుంది. నాకు నిదర్శనం కావాలి – అనుకుంటూ ఇంటికెళ్ళగానే మూర్తిగారినౌకరు బాలయ్య వో చీటీ తెచ్చాడు. తీసి చూశాను.

'మీతో తీసికెళ్ళిన హంటర్‌ని దయతో యితనిద్వారా పంపండి. మీకు మరో హంటర్ పంపుతున్నాను' అనుంది. బాలయ్య ఆ క్రొత్తహంటర్ చేతికిచ్చాడు. దాన్ని లోపలికి

తీసికెళ్ళి వరీక్షగా చూశాను. రెండూ ఇంచుమించు వొకటే. ఇదే ఎందుకు కావాలన్నాడు? నిదానంగా చూశాను. నాతో తెచ్చిన హంటర్ మీద రెండు మూడు గుండ్రని గీకులు మినహా – చాలా కొత్తగా వుంది. తేలికగా వుంది. కాస్తంత సన్నంగా వుంది. తోలుగొళ్ళెందగ్గర చాకుతో కోసి చర్మం తొడుగు వూడదీశాను. లోపల వున్నది ఫ్లాప్. నాలుగు కంత లున్నాయి. ఆ కంతల్లో వొక పొడుగాటి వెండ్రుక చుట్ట బడివుంది. తొందరగా దాన్ని తొడుగులో వుంచేసి జిగురుతో గొళ్ళెందగ్గర అతికించి, దాన్ని జాలయ్యకిచ్చి పంపించివేశాను.

నా సందేహం తీరింది. అతని పూర్తిపేరు వి. బాల కృష్ణమూర్తి. చదువుకునే రోజుల్లో ఆ 'మూర్తి' తీసేశాడు. ఉద్యోగంలోకొచ్చింతరువాత వి. కె. మూర్తి అని పెట్టుకొని ఆ 'బాల'ని వొదిలేశాడు. గడ్డంపెంచేసి ఆ వెనకటి శరీరాన్ని కప్పేశాడు. గతాన్ని విస్మరించాడు. అతనిస్వప్నాలు, ఆదర్శాలు, ఆశలు గతంలో నశింపయ్యాయి. ఆమె కనుక్కుతీరుతుందన్న సంగతులను యితరులు ఆమెకే చెప్పేముందు, భర్త భార్యకే చెప్పెయ్యడం మంచిదని అతనికి తెలీదు, పాపం!

గతాన్ని పూర్తిగావొదల్లేదతను. దానిపై రోత – కోరినట్లుగా అతను తయారవలేదు. అతనికి కావల్సినవి లభ్యమవలేదు. అయితే అదే యథార్థం. అందులోనే అతని నిజస్వరూపం. ఆ జీవితానికి కట్టిపడవేసిన వెండ్రుక కావాలి. ఆ కంఠాన్ని వినే కంతలవాయిద్యం కావాలి. లభించినదాన్ని అదిగా వూహించుకుని బాధపడి, బాధపడి, బాధలోతృప్తిపడి, తృప్తిలో

అసంతృప్తిని రహస్యంగా పీకచుట్టూ వురేసుకుని - ప్రస్తుతాన్ని గతంలో పూడ్చేసి, గతాన్ని భవిష్యత్తుచితిపై పేర్చి - ఏమిటో యీ వికృతమైన, అసహజమైన ఆలోచనలు! తెలుసుకున్న సత్యం - కల్పితగాథ కంటె యథార్థగాథ మహత్తరమైన ఆశ్చర్యాన్ని కలగచేస్తుందన్న నిర్వచనాన్ని ఋజువుచేస్తుందని తృప్తిపడకూడదా? ప్రస్తుతంతో సమాధానపడకూడదూ? విపరీతవ్యాఖ్యానాలుచేసి విసిగించకుండా ముగింపు మొదట్లోనే తెలిసిపోయిన యీ కథ ముగించకూడదూ? ముగింపేమిటో చెప్పివేసిన శాస్త్రి మరీ ఎక్కువ తెలిసున్నవాడవడం వల్ల అసలు రచనకే పూనుకోలేకపోతున్నాడనుకుని అట్లా చేసినందుకు అతనిపై నాకున్న కసిని యీ కథద్వారా పాఠకుడితో పంచుకున్నా కదా అన్న తృప్తిలో నిలిపివేస్తాను.